TEJA NEWS
www.tejanews.com
www.tejanews.co.in

# సాక్షిత
తెలుగు దినపత్రిక
www.sakshithanews.com

www.ajea.in
ALL JOURNALISTS & EDITORS ASSOCIATION

మేడ్చల్ | సంపుటి : 9 | సంచిక : 362 | పేజీలు : 8 | మంగళవారం మార్చ్ 17 2026 | వెల రూ. 5.00/-



## సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి క్లాస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు.ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు.ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.

## మోదీ పర్యటనకు, ఇరాన్‌పై దాడికి సంబంధం లేదు: ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో భారత ప్రధాని మోదీ పర్యటనపై వస్తున్న విమర్శలకు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ స్పష్టతనిచ్చారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు, ఆ వెంటనే ఇరాన్‌పై జరిగిన దాడులకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు.ప్రధాని మోదీ ఫిబ్రవరి 25–26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజుల తర్వాత (ఫిబ్రవరి 28న) ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. ఈ క్రమాన్ని ఉటంకిస్తూ, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు భారత్ మద్దతు ఇస్తోందన్నట్లుగా విపక్షాలు చేస్తున్న విమర్శలను ఇజ్రాయెల్ రాయబారి తోసిపుచ్చారు. ఆ ప్రాంతంలో పరిస్థితులు మోదీ పర్యటనకు ముందు నుంచే అస్థిరంగా ఉన్నాయని, ఆపరేషన్ చేపట్టేందుకు తమకు అవకాశం వచ్చినప్పుడే దాడులు చేశామని ఆయన వివరించారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన పూర్తిగా రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఉద్దేశించినదని, దీనిని సైనిక చర్యలతో ముడిపెట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

## ఈనెల 30 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు



తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేడు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ రేపటికి వాయిదా పడింది. అనంతరం జరిగిన బీఏసీ సమావేశంలో బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, చర్చ ఉంటుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా సభకు సెలవు ఉంటుంది. మార్చి 20న డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.ఈ సమావేశాలు కేవలం బడ్జెట్‌కే పరిమితం కాకుండా, రాజకీయంగా కూడా వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు, రైతు భరోసా, మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది.

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం: కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి



## హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం: తెలంగాణ గవర్నర్

హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రమించేతత్వం కలిగిన తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు అని ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజాకేంద్రీకృత పాలన ప్రభుత్వం విధానమని అన్నారు.విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్



రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని

## మీ సలహాలు స్వీకరిస్తాం.. సభకు రండి: కేసీఆర్‌కు కోమటిరెడ్డి విజ్ఞప్తి


మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించి, సభా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రతిపక్ష నేతగా కేసీఆర్ కనీస బాధ్యత అని ఆయన అన్నారు. నిన్న సంగారెడ్డిలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు మార్పు



కోరుకునే కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ఆ తీర్పును స్వాగతించాలని కోమటిరెడ్డి


## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాలు



## రాష్ట్రంలో ఎల్పీజీ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: సీఎం చంద్రబాబు

ఇరాన్ యుద్ధ ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా, నిల్వల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా వివిధ గ్యాస్ సరఫరా కంపెనీల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్పీజీ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.ప్రస్తుతం రాష్ట్రంలో బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లకు చెందిన 1,154 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందని, 17,209 మెట్రిక్ టన్నుల



## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా: 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా



సాక్షిత
తెలుగు దినపత్రిక

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ.1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## మీ సలహాలు స్వీకరిస్తాం.. సభకు రండి: కేసీఆర్‌కు కోమటిరెడ్డి విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వ పనితీరుపై సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. "మా పనిలో ఏవైనా తప్పులుంటే చెప్పండి, తప్పకుండా మార్చుకుంటాం. కానీ, అసెంబ్లీకే రాకపోవడం సరికాదు," అని హితవు పలికారు. ఇటీవల కేసీఆర్ సభకు ఒక్క నిమిషం మాత్రమే హాజరై, గవర్నర్ ప్రసంగం ముగియకముందే వెళ్లిపోవడం, మరణించిన సభ్యులకు సంతాపం తెలిపేంత వరకు కూడా ఉండకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హాస్యాస్పదమని అన్నారు. ఫ్లోరైడ్ తో నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తే వారి జీవితాలు కూడా బాగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)




జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీటిని తొలగించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి.

## పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్

అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ వేడుక తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. ఈ విగ్రహాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... "శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను" అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం: తెలంగాణ గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్‌ను అనుసరిస్తున్నామని అన్నారు. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని గవర్నర్ తెలిపారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. జీహెచ్ఎంసీని ఇటీవల మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించినట్లు తెలిపారు. బయో ఆసియా సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.1,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా కొనసాగుతోందని అన్నారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఈ రంగంలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని అన్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో రూ.8,744 కోట్లు రైతు భరోసా కింద ఇచ్చామని వెల్లడించారు. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కొత్తగా తమ ప్రభుత్వం 15.12 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, 3.38 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని అన్నారు. స్వయం సహాయక బృందాలకు లక్ష కోట్ల రూపాయల రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈగల్ ప్రత్యేక సంస్థ ద్వారా డ్రగ్ సమస్యలను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నియామక బోర్డులను సంస్కరించినట్లు తెలిపారు. 67,763 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని గవర్నర్ తెలిపారు.

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా: 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని డూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు.

యువగళం హామీని నిలబెట్టుకున్నా

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. "ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, 'వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం' అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను 'భారతదేశ మెర్కాటర్'గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## విజయవాడలో ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం చంద్రబాబు...



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత 21 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమ, షేక్ నజీర్ అహ్మద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సాక్షిత
తెలుగు దినపత్రిక

మార్చ్ । మంగళవారం । 17 । 2026



# నిరుపయోగంగా ఉన్న టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ ను వినియోగంలోకి తీసుకోవాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**సాక్షిత వనపర్తి :**

జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకొని నిరుపయోగంగా ఉన్న నూతన టౌన్ హాల్, నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ ను వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలో నూతనంగా నిర్మించిన టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాటిని వెంటనే వినియోగంలోకి తెచ్చే దిశగా సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన టౌన్ హాల్ లో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిధులు ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంపై సంబంధిత పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్ హాల్లో పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్ సామాగ్రి సమకూర్చడం, సౌండ్ ప్రూఫ్ చేయించడం వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ విభాగాలు సమన్వయంతో పనులను వెంటనే పూర్తి చేసి వచ్చే నెల రోజుల లోపు వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో టౌన్ హాల్ నిర్మాణం కోసం రూ. 3.75 కోట్లు మంజూరు అయ్యాయని, అందులో పూర్తయిన పనులు మినహా మిగతా నిధులతో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ సముదాయాన్ని కూడా ఏప్రిల్ ఒకటో తేదీ లోపు వినియోగంలోకి తెచ్చేదిశగా చర్యలు తీసుకోవాలని



కలెక్టర్ సూచించారు. ఆదిశగా వెంటనే దుకాణాలను వ్యాపారులకు కేటాయించేందుకు లక్కీ డ్రా ప్రక్రియ ద్వారా ముందుకు వెళ్లాలన్నారు. దుకాణాలను పొందేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకునేందుకు ప్రకటనలు ఇచ్చి తెలియజేయాలన్నారు. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు కోసం నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో కావాల్సిన సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు. వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మూసి వాగులో బ్యాటరీలతో చేపల వేట

**అంతరించిపోతున్న చేపపిల్లలు**

**ఆందోళనలో స్థానిక మత్స్యకారులు**

**చేపల సంరక్షణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**సాక్షిత సూర్యపేట జిల్లా ప్రతినిధి:**

సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామ పరిధిలో ప్రవహిస్తున్న మూసి వాగులో కొందరు వ్యక్తులు అక్రమంగా బ్యాటరీల సహాయంతో విద్యుత్ షాక్ ఇచ్చి చేపలను పట్టుతున్న ఘటన స్థానిక మత్స్యకారుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. టేకుమట్ల, రాయినిగూడెం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు మూసి వాగులోని పాలు చెక్ డ్యామ్ ల వద్ద నిల్వ ఉన్న నీటిలో బ్యాటరీలను ఉపయోగించి కరెంట్ ప్రవహింపజేసి చేపలను పడుతున్నారు. ఈ విధంగా విద్యుత్ షాక్ ద్వారా చేపలను పట్టడం వల్ల పెద్ద చేపలతో పాటు చిన్న చేపలు, చేపల గుడ్లు, ఇతర నీటిజీవులు కూడా నశించే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో చేపల పెరుగుదల పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని స్థానిక జాలరులు తెలియజేస్తున్నారు. చెరువులు, వాగులు, నదులలో సహజంగా పెరిగే చేపల సంఖ్య తగ్గిపోతే, వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నిజమైన మత్స్యకారులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో వలలు వేసి చేపలు పట్టే వారు రోజుల తరబడి కష్టపడాల్సి వస్తుంది. అయితే కొందరు వ్యక్తులు తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులను సంపాదించడానికి బ్యాటరీలతో విద్యుత్ షాక్ ఇవ్వడం ద్వారా కొద్ది నిమిషాల్లోనే పెద్ద మొత్తంలో చేపలను పట్టేస్తున్నారు. ఈ విధానం వల్ల నీటిలో ఉన్న చిన్న చేపలు కూడా చనిపోవడంతో భవిష్యత్తులో చేపల వనరులు పూర్తిగా తగ్గిపోతాయని వారు అంటున్నారు. అదేవిధంగా విద్యుత్ ద్వారా చేపల వేట చేయడం చట్టపరంగా కూడా నేరంగా పరిగణించబడుతుందని మత్స్యకారులు గుర్తుచేస్తున్నారు. భారత మత్స్య సంపద సంరక్షణ చట్టాల ప్రకారం నీటిలో విద్యుత్ ప్రవహింపజేసి చేపలు పట్టడం నిషేధించబడింది. అలా చేసే వారిపై కేసులు




నమోదు చేసి జరిమానాలు లేదా జైలుశిక్ష విధించే అవకాశముందని అధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ కొందరు వ్యక్తులు ఈ అక్రమ పద్ధతిని కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో టేకుమట్ల, ఎండ్లపల్లి, రాయినిగూడెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు జిల్లా అధికారులు, పోలీసులు , మత్స్యశాఖ అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. మూసి వాగు ప్రాంతంలో అక్రమంగా బ్యాటరీలతో చేపలు పట్టుతున్న వారిని గుర్తించి వారి వద్ద ఉన్న బ్యాటరీలను స్వాధీనం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే అటువంటి వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి భవిష్యత్తులో ఈ విధమైన అక్రమ పద్ధతులకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మత్స్య సంపదను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అక్రమంగా చేపలు పట్టడం వల్ల సహజ వనరులు నాశనం కావడమే కాకుండా నిజమైన మత్స్యకారుల జీవనోపాధి కూడా ప్రమాదంలో పడుతుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని మూసి వాగులో చేపల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కార్పొరేషన్ పరిధిలోని యూజీడీల నిర్మాణంపై, పూర్తిస్థాయి విచారణ జరపాలి....

**సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య...**

**సాక్షిత పెద్దపల్లి :.**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ కి సంబంధించిన 13 కోట్ల 70 లక్షల రూపాయలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి ఏడు ప్యాకేజీలుగా టెండర్లకు పిలవడం జరిగింది, అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపి విచారణ జరిగేంతవరకు అట్టి బిల్లులు చెల్లించకుండా చర్యలు తీసుకోవాలని, అవినీతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 41వ. డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఈ రోజు పెద్దపల్లి లో జరిగిన ప్రజావాణి లో కలెక్టరేట్ ఏ.ఓ కి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ “రామగుండం నగరపాలక సంస్థ లో ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ కి సంబంధించిన 13 కోట్ల 70 లక్షల రూపాయలకు సంబంధించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిమిత్తం ఏడు ప్యాకేజీలుగా టెండర్ల పిలవడం జరిగిందని కానీ రామగుండం కార్పొరేషన్ లో గల కాంట్రాక్టర్లు సిండికేట్ గా మారి 0.5 టు 1.5% లెస్ పర్సంటేజ్ తో ఆ పనులను దక్కించుకోవడం వెనుక అధికారులు కాంట్రాక్టర్లు భారీ అవినీతికి పాల్పడ్డట్టుగా స్పష్టంగా కనిపిస్తుందని వారు ఆరోపించారు. అంతేకాకుండా ఇట్టి టెండర్ పనులు ఆర్సిసి పైపులు వినియోగించడంతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నాణ్యతతో నిర్మించడం చాంబర్లను నాణ్యతతో కట్టాలని, వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ అట్టి టెండర్స్ పొందిన కాంట్రాక్టర్లు నాసిరకం పనులు నిర్వహించారని, ఆర్సీసీ పైపులకు బదులుగా మట్టి పైపులను వాడి నాణ్యత ప్రమాణాలను పాటించకుండా యూజీడీలు నిర్మించారని సూర్య ఆరోపించారు.వాస్తవంగా సి.డి.ఎం.ఏ నిబంధనల ప్రకారం ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ కార్మికుల జీతభత్యాలకు గాని మున్సిపల్ ఎమర్జెన్సీ వ్యవహారాలకు గాని వాడాల్సి ఉన్నప్పటికీ కమిషన్లకు ఆశపడి ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు కార్పొరేషన్ లో గల కాంట్రాక్టర్లు కుమ్మక్కై, ఆ యొక్క డబ్బును అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఏడు ప్యాకేజీలుగా కేటాయించే విధంగా చేసుకొని అతి తక్కువ లెస్ పర్సెంటేజ్ తో ఈ పనులు దక్కించుకోవడం జరిగిందని అన్నారు.అలా దక్కించుకోవడం వల్ల ఇటు కార్పొరేషన్ కు అటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రామగుండం కమిషనర్ ఇట్టి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, క్వాలిటీ కంట్రోల్ విభాగంతో నాణ్యత ప్రమాణాలు చెక్



చేయడంతో పాటు ఈ అవినీతిలో భాగస్వామ్యమైన అధికారుల పైన, కాంట్రాక్టర్ల పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ విచారణ పూర్తయినంతవరకు ఇట్టి బిల్లులను చెల్లించకుండా ఉండాలని సూర్య డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు అట్టి బిల్లులు చెల్లిస్తే రేపు శాఖాపరమైన న్యాయపరమైన చర్యలకు బలికాక తప్పదని సూర్య హెచ్చరించారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్.

**సాక్షిత :**




మార్చి 16వ తేదీ, కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# ఆర్టీసీ డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న : ఎస్సై సాయిరాం

**సాక్షిత, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**




సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించి ఆర్టీసీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, “Arrive Alivవ (సురక్షితంగా చేరుకుందాం)” అనే సందేశంతో డ్రైవర్లు తప్పనిసరిగా రహదారి నియమాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా లేన్ డ్రైవింగ్ ప్రాముఖ్యత, అతివేగం వల్ల జరిగే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలు, ప్రయాణికుల భద్రతపై డ్రైవర్ల బాధ్యత వంటి అంశాలను వివరంగా తెలియజేశారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల ప్రాణ భద్రత అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బందితోపాటు డ్రైవర్లు పాల్గొన్నారు.

# దూలపల్లి లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్




సాక్షిత : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి లో గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా లిమాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ హాజరయ్యి ఆ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులు కృపా కటాక్షాలు, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లిని మరియు చిత్తారమ్మ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు..అనంతరం అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి ఆ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల సాయి యాదవ్, రమేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, అందే మహేష్ యాదవ్ మరియు కాంగ్రెస్ నాయకులు శివకుమార్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, జిమ్మీ దేవేందర్, దప్పు నరేందర్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య....**

**సాక్షిత పెద్దపల్లి :**



అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్యలి అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తో పాటు పాలనాధికారి బి.ప్రకాష్ కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ పట్టణం చెందిన గెల్లు కేతమ్మ వృధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తెలిపారు.అంతర్గం గ్రామానికి చెందిన కొంకటి స్వరూప గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం కుట్టించే టెండర్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యా శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని తెలిపారు.ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సుమన్ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి పన్ను లు చెల్లించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్రింద ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి గంగయ్య తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షిత
తెలుగు దినపత్రిక

## రాంపల్లి గ్రామంలో సైబర్ మోసాలు,రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం...

**సాక్షిత పెద్దపల్లి :**



గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి నేరాలను నివారించేందుకు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో... రాంపల్లి గ్రామంలో సైబర్ మోసాలు,రోడ్డు భద్రత, రాష్ నెగ్లిజెంట్ డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సీఐ మాట్లాడుతూ... ప్రజలు పోలీసులతో సహకరిస్తూ చట్టాలను పాటిస్తే నేరాలను సమర్థవంతంగా తగ్గించవచ్చని తెలిపారు.గ్రామస్థులకు సైబర్ నేరాల నుండి ఎలా జాగ్రత్తపడాలి, అనుమానాస్పద ఫోన్ కాల్స్,ఓటీపీలు, లింకులు ఇతరులతో పంచుకోకూడదని, అదే విధంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించడం,హెల్మెట్ వినియోగం,అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.గ్రామంలో మద్యపానం నిషేధం అమలు చేయాలని,బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.గ్రామ అభివృద్ధి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని పోలీసులు అభినందించారు. రాంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలు కూడా మద్యపాన నిషేధం అమలు చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సీఐ కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీడీఓ, పీహెచ్‌సీ డాక్టర్, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 200 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన మేయర్ మహంకాళి స్వామి....

**సాక్షిత పెద్దపల్లి :**



రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, 33వ. డివిజన్ కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి లింగమూర్తి అధ్యక్షతన, 33వ. డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బూడిద స్వప్న ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణం, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రూరల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవం

**సాక్షిత పెద్దపల్లి :**



ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రూరల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవం జరిగింది.రామగుండం, కమాన్‌పూర్, అంతర్‌గావ్, పాలకుర్తి మండలాల నుంచి,నాలుగు మండలాల్లోని మొత్తం 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాయి. గ్రామీణ పాఠశాల విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, సమగ్ర వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం కింద వాలీబాల్, ఖో-ఖో వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ప్రారంభ వేడుకలకు ముకుల్ రాయ్, జనరల్ మేనేజర్ (ఓఎం - తెలంగాణ), బిజోయ్ కుమార్ సిక్దర్, హెచ్‌ఆర్ హెడ్, ప్రవీణ్ కె. చౌదరి, డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) హాజరైనారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్ ) అధికారులు,ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ బృందం సభ్యులు, పాల్గొనే పాఠశాలల నుండి ఫిజికల్ డైరెక్టర్లు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్య, క్రీడల ద్వారా సమాజ అభివృద్ధి, యువత సాధికారత పట్ల ఎన్‌టీపీసీ యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు రూరల్ స్పోర్ట్స్ మీట్ విలువైన వేదికను అందిస్తుందని భావిస్తున్నారు.

## శ్రీపొట్టి శ్రీరాములు, త్యాగాలు ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

**కోవూరు తహసీల్దార్ సి.హెచ్ సుబ్బయ్య**



సాక్షిత : నెల్లూరు జిల్లా కోవూరు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా కోవూరు ఎమ్మార్వో సుబ్బయ్య ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ. పొట్టి శ్రీరాములు త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని త్యాగానికి నిలువెత్తు రూపం శ్రీ పొట్టి శ్రీరాములు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొన్నారు...

# అమెరికాతో భారత్ చేసుకున్న అసమాన ఒప్పందాన్ని రద్దు చేయాలి

**ఎల్ భీమన్న ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి**

**సాక్షిత పెద్దపల్లి:**



రామగుండం భారత్ వ్యవసాయ పాడి అన్ని రంగాలను దెబ్బతీసే అమెరికాతో చేసుకున్న అసమాన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం ఏ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్ భీమన్న డిమాండ్ చేశారు. ఏ ఐ కె ఎమ్ ఎస్ సమావేశం రామగుండంలో జరిగింది. ఈ సమావే శానకి ముఖ్య అతిథిగా ఎల్ భీమన్న మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంపు టారిఫ్ విధానాలతో యుద్ధోన్మాదంతో ప్రపంచ దేశాలను ఆవేదనకు గురిచేస్తున్నాడని విమర్శించారు. అమెరికాతో చేసుకున్న ఒప్పందంలో మన దేశము నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్న అత్యవసర వస్తువుల పై 18 శాతం సుంకం విధిస్తే మన దేశానికి వచ్చే అమెరికా దిగుమతులపై జీరో సుంకం రష్యా నుండి కొనుగోలు చేయడానికి, అమెరికా నుండి తొమ్మిది లక్షల కోట్లు విలువైన వస్తువులు కొనుగోలు చేయాలని ఉందని, ఇవి అసమాన ఒప్పందమని అన్నారు. వ్యవసాయ పాడి అన్ని రంగాలు చాలా బాగా దెబ్బతింటుందని అన్నారు వెనిజులా దేశం పై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికాలస్ మధురో అరవి భార్యను కిడ్నాప్ చేసి న్యూయార్క్ లో నిర్బంధిం చారని, నేడు ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దురాక్రమణ దాడులు చేస్తుం దని ఆయన అన్నారు. ఇప్పటికే వేల మంది ఇరానీలు చనిపోయారని వేలమం ది క్షతగాత్రులైనారని కోట్లాది రూపాయల నష్టం జరిగిందని అన్నారు. ఇరాన్ పై యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. యుద్ధాన్ని సాకుగా సూపి గ్యాస్ ధరలను కేంద్రం పెంచిందని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోతున్నా యని, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సంక్షోభం పరిణామాలపై ఏప్రిల్ 4 5 తేదీలలో గుంటూరులో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ జనరల్ కౌన్సిల్ కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు దాముక.లచ్చన్, టీ.రమేష్, వై. శ్రీనివాస్, పోచమల్లు, రాజు,రవి, భాను, తిరుపతి, ఎల్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.విప్లవ అభివందనాల తో దాముఖ లచ్చున్న జిల్లా అధ్యక్షులు ఐ ఎఫ్ టి యు పెద్దపల్లి జిల్లా

## పేదవాడి గౌరవ ప్రదమైన ఇంటి కల సాకరం1వ. డివిజన్ లో ఇందిరమ్మ ఇళ్లు కు ముగ్గు పోసిన కార్పొరేటర్ మడిపెల్లి విజయ- మల్లేష్....

**సాక్షిత పెద్దపల్లి :**



రామగుండం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకం ధ్వార లబ్దిపొందిన కుటుంబాలకు, గౌరవప్రదమైన నివాసం కల్పించుటకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శ్రీకారం చుట్టగా, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రామగుండం కార్పొరేషన్ ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ -మల్లేష్ పీకే రామయ్య కాలనీ లో నూతన ఇల్లా నిర్మాణం కోసం భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు.ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నిజం చేయుటకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ఎంతో మంది నిరాశ్రయులకు స్థిర నివాసం లభిస్తుందని,రామగుండం కార్పొరేషన్ ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని,పేద ప్రజల సంక్షేమానికి ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ముందు నుండి ఎంతో కృషి చేస్తున్నారని, వారు కృషికి ప్రజలు ఏకగ్రీవంగా గెలిపించడం అని ప్రతి కార్పోరేటర్ కానీ నాయకుడు కానీ ప్రజల సంక్షేమాన్ని గుర్తించినట్లయితే తప్పక మడిపెల్లి విజయ మల్లేష్ లాగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని, గెలుపు సుగమము అవుతుందని పలువురు ఆకాక్షించారు. నూతన ఇల్లు మంజూరు అయినా లబ్దిదారులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ- మల్లేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సోషల్ మీడియా ఇన్చార్జి గుర్రాల మల్లేష్ యాదవ్ తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...**

**సాక్షిత పెద్దపల్లి:**



మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించిందని అన్నారు. 2025-26 వార్షిక ప్రణాళికకు సంబంధించి 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు లోన్ తో లక్ష రూపాయల విలువ గల 100 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లోన్ తో 3 లక్షల రూపాయలు విలువ గల 71 త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 7 లక్షల రూపాయలు విలువ గల 15 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ సెట్ లను పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలని, అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, ఆధాయ ధృవీకరణ పత్రం ((గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు. నిరుద్యోగ ఎస్సి యువతీ యువకులు మార్చి 24 లోగా తమ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.ఇఅ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సాక్షిత : బౌద్ధనగర్ లో కద్రియా మసీదు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎం. ఎల్. ఏ, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు కార్యక్రమాలు పరమత సహనానికి ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో రంజాన్ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిరకాలంగా అన్ని కులాలు, మతాల ప్రజల సహజీవనంగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో , బీ.ఆర్.ఎస్. యువ నేత రామేశ్వర్ గౌడ్, మైనారిటీ నేత సమీర్, స్థానిక మైనారిటీ నేతలు పాల్గొన్నారు.



# వృద్ధాప్యంలో వివాదాలు తలెత్తకుండా తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులను కండిషన్ గిఫ్ట్ డిడి,యే చేయాలనీ సూచించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,

**పోలీస్ ప్రజావాణికి 07 ఫిర్యాదుల**

**సాక్షిత వనపర్తి :**

వృద్యాపంలో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫిర్యాదులు తమకు వస్తున్నాయని తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లలకు ఇవ్వాలనుకుంటే సాధారణ గిఫ్ట్ డీడ్ కంటే కండిషన్ గిఫ్ట్ డీడ్ ద్వారా ఇవ్వడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారనీ ఈ డీడీ లో తల్లిదండ్రులను చూసుకోవడం వంటి షరతులు నమోదు చేయవచ్చు. భవిష్యత్తులో వృద్ధాప్యంలో వివాదాలు రాకుండా ఉండేందుకు దీనిని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చట్టబద్ధంగా నమోదు చేయించడం అవసరమని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు . ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విధిగా నిర్వహిస్తున్న పోలీస్ ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి మొత్తం 07 ఫిర్యాదులు అందినట్లు ఫిర్యాదులు స్వీకరించిన



ఎస్పీ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు అందిన ఫిర్యాదుల్లో 02 – భూతగాదాల ఫ05 – ఇతర ఫిర్యాదులు వున్నాయి.

# వెల్టూరుసర్పంచ్ ను పరామర్శించిన.మాజీ మంత్రి.నిరంజన్ రెడ్డి

**సాక్షిత వనపర్తి :**

పెద్దమందడి మండలం, వెలటూరు గ్రామ సర్పంచ్ దండు.అశోక్ అనారోగ్య కారణంగా, రెండు రోజుల క్రితం మహబూబ్నగర్ ఆర్.ఆర్. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది, ఆదివారం రోజు తన సొంత గ్రామానికి చేరుకున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , వెల్టూరు గ్రామంలోని సర్పంచ్ నివాసానికి చేరుకొని అతడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్నటు వంటి, సర్పంచ్ అన్న దండు.నరేష్ ను, సర్పంచి యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కుటుంబ సభ్యులు ఎలాంటి దిగులు చెందోద్దు అని, వారికి ఎలాంటి అవసరం వచ్చిన మేమున్నామంటూ వారికి ధైర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో, మాజీ జెడ్పిటిసి కె.రఘుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సాకే. వెంకటయ్య, మాజి గ్రామ రైతుబంధు అధ్యక్షులు



జి.రఘువర్ధన్ రెడ్డి, గ్రామ బిఆర్ఎస్ పార్టీ సెలక్షన్ కమిటీ మెంబర్ చిత్తూరు. కృష్ణారెడ్డి, దండు.నరేష్, సుంకరి.బుసయ్య, సుద్ద బాయి.రాజు, జింకల. బాలరాజు, తమ్మలి.రాము, జింకల. సాయి ఆయన వెంట ఉన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం: శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం చైర్మన్ గోపాల్ రెడ్డి

**వివేకానంద బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 49 మంది యువతీ, యువకులు**

**శంకర్‌పల్లి సాక్షిత :**

రక్తదానం ప్రాణదానంతో సమానం అని మరకత శివాలయం చైర్మన్ గోపాల్ రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామ శివారులో గల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ఆవరణలో వివేకానంద బ్లడ్ బ్యాంక్ మెహదీపట్నం సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛందంగా 49 మంది యువతి, యువకులు



రక్తదానం చేయగా, వారికి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆర్గనైజర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మృతి చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 350 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డా. సంజీవ, డా. రాజు ఉన్నారు.

# కంటి చూపు జాగ్రత్త: డా. భాగ్య శేఖర్ గౌడ్

**సాక్షిత శంకర్‌పల్లి:**

మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల తెరలను అదేపనిగా రోజులో ఎక్కువ సమయం చూస్తుండటంతో కంటిచూపుపై ప్రభావం పడుతోంది. కంటి సమస్యలతో చాలామంది సతమతమవుతున్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి నీటికా సులు (గ్లకోమా) ఏర్పడి చూపు మందగిస్తుంది. 40 ఏళ్లకు పైబడిన కంటి జబ్బులున్న వారికి అవగాహన కల్పిస్తారు. వికారాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లో పలువురు గ్లకోమాతో బాధపడుతున్నారు. వాహన డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు భాగ్యశేఖరౌడ్ వివరించారు.




**ఎవరికి, ఎలా వస్తుంది?**

40 ఏళ్లకు పైబడిన వారికి గ్లకోమా కంటి సమస్య వేధిస్తోంది. ప్రధానంగా బీపీ, షుగర్ తోపాటు దీర్ఘకాలిక వ్యాధి గ్రస్థులకు సులభంగా వస్తోంది. తలనొప్పి, వాంతులు కాంతి చుట్టూ ఇంద్రధనుస్సు వల యాలు కనిపిస్తే గ్లకోమా వచ్చినట్లే. క్రమంగా కంటి చూపు మందగిస్తోంది. కళ్లు ఎర్ర బారి నీళ్లొస్తాయి. జన్యుపరంగా వచ్చే వ్యాధి. కంటి నరం దెబ్బతినడం వల్ల సమస్య పెద్ద దవుతుంది. లేజర్ సర్జరీ చేస్తారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఆకుకూరలు, పండ్లు, చేపలు, కోడిగుడ్లు, నట్స్, సమతుల ఆహారం తీసుకోవాలి. వైద్యులు సూచిస్తే అద్దాలు పెట్టుకోవాలి. ఫోన్లు, కంప్యూటర్ల తెరలను చూసే సమయాన్ని తగ్గించుకో వాలి. ధూమపానం, మద్యపానం చేయొద్దు. పడుకునే టపుడు తల కింద కొద్ది ఎత్తులో దిండు పెట్టుకోవాలి.

## పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థన చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

**సాక్షిత పెద్దపల్లి//గోదావరిఖని:**

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం లు ప్రార్థన చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని రామగుండం నగరపాలక మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 4 ఇంక్లెన్ ఈద్గాను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఈద్గా వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈద్గా ప్రాంగణంలో శుభ్రత, తాగునీటి సదుపాయం, లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రంజాన్ పవిత్ర మాసం ముస్లిం లకు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగి ఉందని, ఈ సందర్భంగా వారు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే ఎల్లప్పుడూ మైనార్టీ సోదర సోదరీమణుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటారని, వారి సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అండగా నిలుస్తారని చెప్పారు. అదేవిధంగా



రామగుండం నియోజకవర్గంలోని అన్ని ఈద్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, మసీదుల కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**

**సాక్షిత పెద్దపల్లి :**

జనగణన 2027 కార్యక్రమాన్ని మన పెద్దపల్లి జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తెలిపారు. సోమవారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ , హౌసింగ్ సెన్సెస్ సంబంధించి సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ. అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ, జనగణన తొలి దశ పై శిక్షణ కార్యక్రమం మార్చి 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని అన్నారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. జనగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి మీద ఉందన్నారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన అధికారులు పూర్తి స్థాయిలో శిక్షణ పొంది అవగాహన పొందాలని తెలిపారు. జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల, మున్సిపల్, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మారుమూల గ్రామాల ప్రజలకు మొబైల్ వ్యాన్ల ద్వారా ఉచిత న్యాయ సేవలు

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత**

**సాక్షిత వనపర్తి :**

రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు గ్రామగ్రామానికి న్యాయసేవలను విస్తరించాలనే ఉదేశ్యంతో తెలంగాణ న్యాయసేవ అధికార సంస్థ రెండు మొబైల్ వ్యాన్ లను తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శ్యామ్ కోసి లు ప్రారంభించినట్లు వనపర్తి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చేర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. ఆర్. సునీత , వనపర్తి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి. రజని లు తెలిపారు. నూతనంగా ప్రారంభించబడిన మొబైల్ వ్యాన్లు ఇకనుండి లోకదాలత్ పైన గ్రామాగ్రామానికి వెళ్లి ప్రజలకు చట్టాలపైన అవగాహన మరియు న్యాయసేవాధికారాసంస్థలు ఎలాపనిచేస్తాయో, న్యాయ సేవా అధికార సంస్థ ప్యానెల్ న్యాయ వాదులు పారా లీగల్ వాలంటీర్స్ ఈ మొబైల్ వ్యాన్ ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఉచిత న్యాయసేవలు, ఎలా అందజేయడం జరుగుతుందో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ మొబైల్ వ్యాన్ లో వీడియోస్ చూడడానికి ఎల్ఈడి ( ూవ౹) టీవీ, అక్కడినుండే వీడియో కన్ఫరెన్స్ వంటి సదుపాయాలు ఉంటాయని ఈ మొబైల్ న్యాయసేవ వ్యాన్ ద్వారా ప్రజలకు న్యాయసేవలు మరింత దగ్గర్వుతుందని ప్రజలకు ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా ప్రజలకు న్యాయసేవ మరింత దగ్గర్వుతుందని జిల్లా న్యాయసేవ చేర్మెన్ మరియు సెక్రటరీ లు తెలిపారు. ఈ మొబైల్ న్యాయ సేవా వ్యాన్ గ్రామ గ్రామానికి వెళ్లి న్యాయ సేవల గురించి వివరిస్తుంది కావున ప్రతి ఒక్క ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**సాక్షిత వనపర్తి :**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 34 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సాక్షిత
తెలుగు దినపత్రిక

## ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన : కలెక్టర్

**సాక్షిత సూర్యపేట జిల్లా ప్రతినిధి:**



సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా "సి" సెక్షన్, జిల్లా కోశాధికారి కార్యాలయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఎన్ఐసి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి, హౌసింగ్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయా లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నాయా అని పరిశీలించారు ఫైల్స్, పిఆర్ రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయో లేదో అని తనిఖీ చేశారు, అన్ని కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా క్రమ పద్ధతిలో ఉండాలని, కార్యాలయాలు పరిశుభ్రంగా ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఉండాలని, హాజరు, పి ఆర్ రిజిస్టర్లు, కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా నిర్వహించాలని ప్రతి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏవో సుదర్శన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోవూరు వైసిపి నాయకులు





సాక్షిత : తాడేపల్లి రాష్ట్రం లోని 175 శాసన సభ నియోజకవర్గాలకు ఇటీవల నియమించబడిన నియోజకవర్గ పరిశీలకుల సమావేశం తాడేపల్లి కేంద్ర కార్యాలయం లో జరిగినది.ఈ సమావేశానికి సర్వేపల్లి నియోజక వర్గ పరిశీలకులు,వీరి చలపతిరావు, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు హాజరైనారు

## అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వేమిరెడ్డి దంపతుల నివాళి



సాక్షిత : ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125 వజయంతి సందర్భంగా నెల్లూరు పార్లమెంటు సభ్యుల వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తమ నివాసంలో శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ద్వారా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఎంతోమందికి ఆదర్శప్రాయులని, నేటి యువతకు ఆయన జీవితం ఒక పాఠం అన్నారు. కూటమి ప్రభుత్వ సారథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

## ఉత్సాహంగా ముగిసిన నిహాన్ షోటోకన్ జాతీయ స్థాయి కరాటే పోటీలు

**శంకర్‌పల్లికి చెందిన అనిల్ టీం రీత్విక్ రాజ్ గైక్వాడ్ గెలుపు**

**సాక్షితలిశంకర్‌పల్లి:**




సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీలలో 'నిహాన్ షోటోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను "హన్సి వి. రవీందర్ కుమార్," "షిహాన్ ఈ. శ్రీనివాసులు" సంయుక్తంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మంది కరాటే క్రీడాకారులు పాల్గొని కటా, కుమిటి విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల ప్రారంభోత్సవానికి "జీ7 ఛానల్ చైర్మన్ గణేష్," "ఈ వింగ్స్ డైరెక్టర్ రామకృష్ణ." "లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞ రాజు" తదితరులు హాజరయ్యారు. అలాగే కియో ఆర్గనైజేషన్ రెఫరీలు విజయ్, సయ్యద్ అక్బర్ అలీ, కనకరాజు, రాష్ట్ర బాధ్యులు వి. నరేందర్, సి. హెచ్ సాయికుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఫస్ట్ బెస్ట్ టీం కప్ ను 'హైదరాబాద్ శంకర్‌పల్లికి చెందిన అనిల్ టీం గెలుచుకోగా రీత్విక్ రాజ్ గైక్వాడ్, రెండవ టీం కప్ ను విఎన్ఆర్ కరాటే అకాడమీకి చెందిన నరేందర్ టీం, మూడవ టీం కప్ ను అశోక చక్రవర్తి టీం దక్కించుకుంది. విజేతలకు కప్పులు, మెడల్స్, మెమెంటోలు అందజేశారు. పాయింట్ల ఆధారంగా 217 పాయింట్లతో తెలంగాణ మొదటి స్థానం, 116 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానం, 76 పాయింట్లతో మూడవ స్థానం సాధించాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగి విజయవంతంగా ముగిశాయి.

## బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లక్షా 70వేల విలువైన ఐదు కంప్యూటర్లు, నాలుగు సీసీ కెమెరాలను అందజేత

**సాక్షిత పెద్దపల్లి:**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 36వ డివిజన్ స్థానిక గాంధీనగర్ లోని గాంధీ పార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లక్షా 70వేల విలువైన ఐదు కంప్యూటర్లు, నాలుగు సీసీ కెమెరాలను అందజేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర మేయర్ మహంకాళి స్వామి రిబ్బన్ కట్ చేసి సీసీ కెమెరాలను, అనంతరం ప్రీ ప్రైమరీ ప్లే ఏరియాను లాంఛనంగా ప్రారంభించారు. డెస్క్ టాప్ కంప్యూటర్స్ ను ఉపాధ్యాయులకు అందజేసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను సైతం ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్యాసంస్థలలోనే అభ్యసించానని గుర్తు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక 36వ డివిజన్ కార్పొరేటర్ కల్వల పద్మావతి-రంజిత్, రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం, బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి కోలేటి సతీష్, ఇతర కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు మీర్జా ఫజల్ బేగ్, వడ్లూరి రవి, దాసరి విజయ్ కుమార్, దూళికట్ట సతీష్, జగిత్యాల మాజీ ఎంపీడీవో అల్లెంకి లింగమూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త కోలేటి సంపత్, ఉపాధ్యాయులు విజయ శాంతి, సంపత్, స్వరూప్ చంద్, రమేష్, రవి, సంగీత, రమాదేవి, గోదాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గుడ్డి కేంద్రమా గ్యాస్ ఎక్కడ..? కళ్లకు నల్లనిగంతలతో వినూత్న సిపిఐ నిరసన


**యుద్ధం పేరుతో పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్**

**సాక్షిత వనపర్తి :**




దేశంలో గ్యాస్ కొరతతో ప్రతి చోట ఖాళీ సిలిండర్ల క్యూ లైన్లు కనిపిస్తున్నా గ్యాస్ కొరతలేదని కేంద్రం చెబుతోందని, గుడ్డి ప్రభుత్వమా కళ్ళు తెరిచి నిజం చూడాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా, గ్యాస్ కొరత లేదని బుకాయిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కళ్ళకు నల్లని గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాలు పల్లెల్లో గ్యాస్ లేక ప్రజలు అల్లాడి పోతున్నారన్నారనీ గ్యాస్ బుక్ చేస్తే బుక్ కావడం లేదనీ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తే అక్కడ క్యూ లైన్లు కనిపిస్తున్నాయన్నారు. గ్యాస్ లేకపోవడంతో కట్టెలతో వంటలు చేస్తున్నారని కొందరు ఎలక్ట్రిక్ స్టవ్ లను కొంటున్నారన్నారు. వంట చెరకు కూడా రేటు పెరిగిందన్నారు. హోటల్లు మేస్ లు కళాశాల క్యాంటీన్లు పలు వ్యాపార సముదాయాలు గ్యాస్ లేక మూతపడ్డాయనీ అన్నారు. కొన్నిచోట్ల టీ కొట్టు కూడా బంద్ అయ్యాయి అన్నారు. ఇంతటి ఇబ్బందికర పరిస్థితి కల్పిస్తున్న గ్యాస్ కు కొర తలేదని బుకాయించటం దారుణమన్నారు. వంట గ్యాస్ సిలిండర్ కు రూ. 60, వాణిజ్య సిలిండర్ కు రూ. 115 పెంచిందని, ఆ ధరకు కూడా దొరకటం లేదన్నారు. యుద్ధం పేరుతో పెంపును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం వారి భూభాగాలను ఆక్రమించి ముడి చమురు నిక్షేపాలను కొల్లగొట్టేందుకేనని విమర్శించారు. కేంద్రం అమెరికా ట్రంప్ కు లొంగిపోయిందన్నారు. యుద్ధం ప్రభావం తో అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయని సామాన్యుడు కొనలేని పరిస్థితి ఉందన్నారు. భయంకర దాడులతో 1900 మంది మరణించారని 20,000 మంది గాయపడ్డారని వాతావరణం కాలుష్యమై ప్రజలు రోగాల బారిన పడుతున్న అమెరికా ఇజ్రాయిల్ దాడులను నరేంద్ర మోడీ ఖండించడం లేదన్నారు. ఈ వైఖరి దారుణమన్నారు. ఇండియా స్వతంత్రతను నరేంద్ర మోడీ ట్రంప్ కు తాకట్టు పెట్టారన్నారు. అమెరికా దయ పై నెల రోజులు రష్యా సమురు ఇండియా కొనాల్సిన పరిస్థితి వచ్చిందంటే దానికి కేంద్రం వైఫల్యమే కారణమన్నారు. వెంటనే యుద్ధం ఉపసంహరించాలని గ్యాస్ ధరలను తగ్గించాలని, కొరత లేకుండా చూడాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కళావతమ్మ, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి , పట్టణ కన్వీనర్ జయమ్మ,సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, డిహెచ్పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, శిరీష, జ్యోతి, రూప, సాయి లీల, వెంకటమ్మ, సుప్రియ,కురుమూర్తి, కృష్ణ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు.
పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# మహిళలు విద్య, ఆరోగ్యం, ఆర్థిక అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**మహిళలు కుటుంబానికి వెన్నెముక వంటి వారని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉండగలదు: జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**సాక్షిత వనపర్తి :**



ఐడీఓసి సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ (మార్చి 8) వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే ఆ సమాజం నిజంగా అభివృద్ధి చెందినట్లు అని తెలిపారు. ఒక మహిళ బలంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం కూడా దృఢంగా తయారవుతుందన్నారు. కాబట్టి మహిళలకు ఆరోగ్యమనేది ఎంతో కీలకమైన అంశమని గుర్తు చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు పురుషులతో సమానంగా భోజనం చేయడంతో పాటు అన్ని అంశాల్లో సమానంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక మహిళ తన సొంత ఆరోగ్యం పై మొదటి ప్రాధాన్యత ఉంచాలని తెలియజేశారు. మన ఇళ్లలో మనం వ్యవహరించే విధానం పిల్లలపై ప్రభావం చూపుతుంది కాబట్టి మహిళలను గౌరవించడం ఇంటి నుంచి ప్రారంభం కావాలని గుర్తు చేశారు. అదేవిధంగా సమాజంలో ఒక్క బాల్య వివాహం కూడా జరగడానికి వీల్లేదని, 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేసేవారి సమాచారాన్ని ప్రభుత్వ అధికారులకు అందజేయాలని తద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల్యంలోనే వివాహం చేయకుండా వారిని ఉన్నత చదువులు చదివించాలని, విద్యతోనే అందరికీ సమాజంలో గౌరవం పెరుగుతుందని తెలియజేశారు. చదువులో అమ్మాయిలు మధ్యలోనే డ్రాప్ అవుట్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళా దినోత్సవం మహిళల సాధికారత, సమాన హక్కులు మరియు సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గుర్తుచేసే ముఖ్యమైన రోజు అని అన్నారు. మహిళలు విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో మరింత ముందుకు రావాలని సూచించారు. మహిళలు స్వయం సమృద్ధిగా ఎదిగితే కుటుంబం, సమాజం మరియు దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో, బాలికల విద్యను ప్రోత్సహించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యతోపాటు ఆర్థికంగా కూడా మహిళలు అభివృద్ధి సాధించాలని సూచించారు. మన జిల్లాలో పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన వనజ, రాములమ్మ అనే మహిళలను అందరు స్పూర్తిగా తీసుకోవాలని తెలిపారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయని వాటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన అనే పథకాన్ని ప్రారంభించిందని, దాన్ని ప్రతి ఒక్కరూ అమ్మాయిల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా రాజకీయాల్లో సైతం మహిళల పాత్ర పెరగాలని సూచించారు. స్త్రీ పురుష సమానత్వం పై అమ్మాయిలకు చిన్నప్పటినుంచే తమ తల్లి తండ్రులు నేర్పించాలని, సమాజంలో ఇంకా ముందుకు వెళ్లేలా స్ఫూర్తి కల్పించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ ఈరోజు మహిళలు అన్ని రంగాల్లో దూసుకు వెళ్తున్నారని చెప్పడానికి గర్విస్తున్నాను అన్నారు. కేవలం మహిళా దినోత్సవం రోజు కాకుండా ప్రతిరోజు మహిళలకు గౌరవం దక్కేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కూడా మహిళల భద్రత కోసం ఎంతగానో కృషి చేస్తుందని, పోలీస్ శాఖలో మహిళ ఉద్యోగుల పాత్ర పెరిగిందని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలకు ఆరోగ్యం ఎంతో, మహిళలు కుటుంబానికి వెన్నెముక వంటి వారిని వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉండగలుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళ ఉద్యోగులకు, మంచి ప్రతిభ కనబరిచిన మహిళలకు, విద్యార్థినిలకు కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, డి ఆర్ డి ఓ ఉమాదేవి, జి సి డి వో శుభలక్ష్మి, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఆర్ ఎం ఓ రెడ్డి కుమారి, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన ఇటలీ కెరటం.. జకోవిచ్ 'ఆల్‌టైమ్ రికార్డు' బద్ధలు కొట్టేశాడు.!





చరిత్ర సృష్టించిన ఇటలీ కెరటం.. జకోవిచ్ 'ఆల్‌టైమ్ రికార్డు' బద్ధలు కొట్టేశాడు.!

పురుషుల టెన్నిస్‌లో తారాజువ్వలా దూసుకొచ్చిన జన్నిక్ సినర్ (Jannik Sinner) చరిత్ర సృష్టించాడు. చిన్న వయసులోనే అన్ని ప్రధాన హార్డ్ కోర్ట్ టోర్నీల్లో ఛాంపియన్‌గా అవతరించాడు. సోమవారం ఇండియన్ వెల్స్ ఫైనల్లో డానిల్ మెద్వెదేవ్ (ఋఅఅశ్రీ వీవఁజవఁవజ)ను చిత్తుగా ఓడించిన ఇటలీ కెరటం.. 24 ఏళ్లకే అన్ని హార్డ్‌కోర్ట్ ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. తద్వారా నొవాక్ జకోవిచ్ (Novak Djokovic) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును అతడు బద్ధలు కొట్టాడు. ఇండియన్ వెల్స్ ఫైనల్లో సినర్ ధాటికి డానిల్ మెద్వెదేవ్ తేలిపోయాడు. సెమీఫైనల్లో వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాస్ (Carlos Alcaraz)కు చెక్ పెట్టిన రష్యా ఆటగాడు ఇటలీ స్టార్ దూకుడు ముందు నిలువ లేకపోయాడు. ఈ టోర్నీలో ఒక్క సెట్ కూడా కోల్పోని సినర్.. ఫైనల్లోనూ పంజా విసిరి తో మట్టికరిపించాడు. ఫలితంగా 24 ఏళ్లకే ప్రధాన హార్డ్ కోర్టుల్లో ఛాంపియన్‌గా అవతరించాడీ సంచలనం. మొట్ట మొదటి ఇండియన్ వెల్స్ ట్రోఫీతోనే సినర్ దిగ్గజాల సరసన చేరాడు. ఇదివరకు జకోవిచ్ 31 ఏళ్లప్పుడు ఈ ఘనత సాధించాడు. కొన్నాళ్లుగా జకో పేరిటే ఉన్న ఈ రికార్డును సినర్ బ్రేక్ చేశాడు. అంతేకాదు అన్ని హార్డ్ కోర్టు 1000 మాస్టర్స్ టోర్నీల్లో విజేతగా నిలిచిన మూడో ఆటగాడిగానూ చరిత్రకెక్కాడు. అతడి కంటే ముందు రోజర్ ఫెదర్, జకోవిచ్ మాత్రమే ఈ మైలురాయిని అధిగమించారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్బంగా.. నివాళులర్పించిన.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



సాక్షిత : నెల్లూరు వైసిపి సిటీ ఆఫీస్ లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం వైసీపీ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులతో కలిసి.పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసంపొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని వారు గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం.58 రోజులు దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు.వారి త్యాగ ఫలితంగానే.ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి.తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి ఆర్యవైశ్య విభాగం జిల్లా అధ్యక్షులు మంచి కంటి శ్రీనివాసులు, 8వ డివిజన్ కార్పొరేటర్ కామక్షి దేవి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చిదేళ్ళ కిషన్, నగర ఆర్యవైశ్య విభాగం అధ్యక్షులు జమిలి శ్రీనివాసులు,16 కార్పొరేటర్ శ్రీకాంత్ రెడ్డిజిల్లా విద్యార్ది విభాగం అధ్యక్షులు ఆశ్రీత్ రెడ్డి, 3,4,9 16, డివిజన్ అధ్యక్షులు నారాయణరెడ్డి,సంధాని, ధనుజా రెడ్డి, సగిలి జయ రామిరెడ్డి వైసిపి నాయకులుఉమా, కొండయ్య, వెంకటేశ్వర్లు,పెంచలయ్య, మీరా పాల్గొన్నారు.

## బాచుపల్లిలో చలివేంద్రం ప్రారంభం



సాక్షిత : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద వాసవి క్లబ్ బాచుపల్లి మరియు శ్రీ ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం మరియు ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభించబడింది.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిధిగా కొలన్ హన్మంత్ రెడ్డి గారు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో V105A గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి, అల్లాడి మహేష్, కొలన్ వీరేందర్ రెడ్డి , కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ కృష్ణ రెడ్డి,సంగమేశ్వర్, రాఘువేంద్ర, సుధాకర్, శ్రీకాంత్, శ్రీరామ్, ప్రభాకర్‌లి లివీరేష్, శ్రీనివాస్, నితేష్, కార్తిక్, ప్రశాంత్ పాల్గొన్నారు

## దూలపల్లి లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

సాక్షిత : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి లో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యి ఆ మల్లికార్జున స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కొనియాడారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హన్మంతన్ననీ శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సాక్షిత
తెలుగు దినపత్రిక



## ఆస్కార్ వేదికపై కోట శ్రీనివాసరావుకు నీరాజనం... తెలుగు నటుడికి అరుదైన గౌరవం

ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ (ఆస్కార్) అవార్డుల వేడుకలో తెలుగు సినీ పరిశ్రమ గర్వపడే క్షణం ఆవిష్కృతమైంది. గతేడాది దివంగతులైన సినీ ప్రముఖులకు నివాళు లర్పించే 'ఇన్ మెమోరియం' విభాగంలో విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నివాళి కార్యక్రమంలో ఆయన పేరును స్మరించుకోవడం తెలుగు సినిమాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది.లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కోటతో పాటు బాలీవుడ్ దిగ్గజం ధర్మేంద్ర, సీనియర్ నటి సరోజాదేవి, ప్రముఖ నటుడు మనోజ్ కుమార్‌లను కూడా అకాడమీ స్మరించుకుంది. అకాడమీ అధికారిక వెబ్‌సైట్‌లోని గ్యాలరీలో ఈ నలుగురు భారతీయ తారల చిత్రాలను ప్రదర్శించి, వారి సేవలను ప్రపంచానికి గుర్తు చేసింది. భారతీయ నటుల జాబితాలో తొలుత కోట శ్రీనివాసరావు పేరును ప్రస్తావించడం విశేషం. 2025 జూలై 13న కన్నుమూసిన కోట శ్రీనివాసరావు, తన అద్భుతమైన నటనతో తెలుగు చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారు. విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన, తొమ్మిది నంది అవార్డులతో పాటు పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. వీరితో పాటు బంగ్లాదేశ్ నటి జయశ్రీ కబీర్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ ఎస్. కృష్ణస్వామికి కూడా అకాడమీ నివాళులర్పించింది. ప్రపంచ సినీ వేదికపై భారతీయ నటీనటులకు, ముఖ్యంగా తెలుగు నటుడికి ఈ స్థాయిలో గౌరవం దక్కడం పట్ల సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట వంటి గొప్ప నటుడి సేవలను అంతర్జాతీయ వేదిక గుర్తించడం గర్వకారణమని పేర్కొంటున్నారు.

## పవన్ డైలాగ్స్ చెప్పి అలరించిన శ్రీలీల, రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో హీరోయిన్లు శ్రీలీల, రాశీ ఖన్నా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాంకర్ సుమ వారితో చిట్ చాట్ చేస్తూ పవన్ కల్యాణ్ సినిమాలోని డైలాగ్స్ చెప్పమని కోరగా, శ్రీలీల, రాశీ ఖన్నా తమదైన శైలిలో పవన్ కల్యాణ్ డైలాగ్ చెప్పి అభిమానులను అలరించారు. యూసఫ్‌గూడలోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిన్న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈవెంట్‌లో పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవి శంకర్, యాంకర్ సుమ కనకాల పాల్గొన్నారు. కాగా, 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ సినిమాకు బెనిఫిట్ షో ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చింది.






## 'ఉస్తాద్ భగత్ సింగ్'... తమిళనాడులోని అన్ని ప్రాంతాల్లో రిలీజ్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోనూ భారీ ఎత్తున విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు.ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తమిళనాడు పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏజీఎస్ సినిమాస్ దక్కించుకుంది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పవన్ కల్యాణ్ సినిమాను తమిళనాడు వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

## ఆస్కార్ వేదికపై అరుదైన 'టై'.. ఒకే అవార్డుకు ఇద్దరు విజేతలు!




ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓ అరుదైన, ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. 98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో కేవలం ఏడోసారి ఒకే కేటగిరీకి ఇద్దరు విజేతలుగా నిలిచి 'టై' నమోదైంది. ఈ ఊహించని పరిణామంతో డాల్బీ థియేటర్ ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగింది. వివరాల్లోకి వెళ్తే, బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డును ప్రకటించేందుకు నటుడు కుమాయిల్ నంజియాని వేదికపైకి వచ్చారు. విజేత పేరు ప్రకటించేందుకు ఎన్వలప్ తెరిచిన ఆయన, ఒక్కసారిగా మౌనంగా ఉండిపోయారు. అనంతరం, 'ఈ కేటగిరీలో టై అయ్యింది. ఇద్దరు విజేతలు ఉన్నారు' అని ప్రకటించడంతో సభలో ఆసక్తి నెలకొంది. ఈ అవార్డును 'ది సింగర్స్', 'టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా కుమాయిల్ నంజియాని చమత్కరిస్తూ, 'షార్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వడానికి రెట్టింపు సమయం పట్టడం విచిత్రంగా ఉంది' అన్నారు. దీనిపై హోస్ట్ కోనన్ ఓబ్రియన్ స్పందిస్తూ, 'ఈ టై వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆస్కార్ బెట్టింగ్ వేసిన 22 మిలియన్ల మంది పరిస్థితి ఏంటి?' అని జోక్ చేయడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ అరుదైన ఘటన సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది.

Printed,Published and Owned by : **K.MANJULATHA / EDITOR : BEERAM TEJOMURTHY PRINTED AT : SREE SESHA SAI ENTERPRISES,**plot no-19,ida,balanagar PUBLISHED AT PLOT NO-128 B, gajularamaram, shapurnagar, suraram, medchal district, ts-500055. RNI NO - TELTEL/2017/73751. CELL NO : 9912188899. EMAIL : sakshithanews@gmail.com